# మిర్చి రైతు దగా

మిర్చి పంట రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతన్న దిగాలు చెందుతున్నాడు. రైతులు కష్టకాలంలో ఉంటే ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులంతా సిండికేట్ అయ్యి మిర్చి రైతుల కంట్లో కారం కొడుతుంటే అధికారులు, పాలకవర్గం చోద్యం చూస్తోంది. వ్యాపారులు జెండాపాటకు హాజరుకాకుండా రైతులకు సరైన గిట్టుబాటు దక్కకుండా నిలువునా మోసం చేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గతేడాది రూ.23 వేలు పలికిన క్వింటా మిర్చి ధర.. ప్రస్తుతం రూ.14 వేలకే పరిమితమైంది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రూ.లక్షలు పెట్టి సాగు చేసిన అన్నదాతలు లబోదిబోమంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించండి సారూ.. అని నెత్తీనోరు మొత్తుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. **–ఖమ్మం, మార్చి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**

- జిల్లాలో గిట్టుబాటు ధరలేక కుదేలవుతున్న కర్షకులు
- ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో వ్యాపారుల సిండికేట్
- తేమ, నాణ్యత పేరుతో జెండాపాటకు తగ్గించి కొనుగోళ్లు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం, ఏఎంసీ పాలకవర్గం
- పెట్టుబడులు కూడా రావడం లేదంటూ రైతుల గగ్గోలు
- ఈ ఏడాది ఏకంగా రూ.14 వేలకు పడిపోయిన ధరలు
- నిరుడు ఇదే సీజన్‌లో రూ.23 వేల చొప్పున కొనుగోళ్లు
- సాలీనా ఎకరానికి రూ.లక్ష వరకూ నష్టపోతున్న రైతులు


మార్కెట్‌కు భారీగా వచ్చిన మిర్చి పంట

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. మార్కెట్‌లో తిష్ట వేసుకొని కూర్చున్న వ్యాపారుల చేతిలో నిలువునా మోసపోతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సిండికేట్ వ్యవహారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా ఫరిడవిల్లుతుండడంతో అన్నదాతలు ఆరుగాలం శ్రమించినా ఫలితం శూన్యమంటూ బోరున విలపిస్తున్నారు. ఈ ఏడాది ఎకరాకు కౌలు మొదలుకొని పురుగు మందులు, కూలీలు కలుపుకొని రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు పెట్టుబడి పెడుతున్నారు. కానీ.. ఈ ఏడాది తామర తెగుళ్ల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. తీరా చేతికొచ్చిన కొద్ది పంటనూ అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే ధర తక్కువగా ఉండడంతో రైతులు అయోమయంలో ఉన్నారు. మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు మొదలైనప్పటి నుంచి గిట్టుబాటు ధర కోసం మొత్తుకుంటున్నా.. అధికారులు, పాలకవర్గ బాధ్యులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు నిత్యం 70–80 వేల బస్తాల మిర్చి వస్తుంటుంది. ఖమ్మం, వరంగల్‌తోపాటు తెలంగాణకు సరిహద్దుగా ఉన్న ఆంధ్రా ప్రాంతం నుంచి సైతం మార్కెట్‌కు పెద్దఎత్తున మిర్చి తరలివస్తున్నది. దీంతో గత సోమవారం ఒక్కరోజే లక్షా 20 వేల మిర్చి బస్తాలు ఖమ్మం మార్కెట్‌కు వచ్చాయి. అత్యధికంగా మార్కెట్‌కు మిర్చి వస్తుందనే సాకుతో వ్యాపారులు క్వింటా మిర్చి ధరను రూ.14 వేలకే పరిమితం చేశారు. జెండాపాటకు వచ్చి మిర్చి ధరను పెంచాల్సిన వ్యాపారులు కేవలం అరకొరగా హాజరై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నారు. కనీసం రూ.25 వేలు మద్దతు ధర ఇస్తేనే గిట్టుబాటు కలుగుతుందని అన్నదాతలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జెండా పాట రూ.14 వేలు పైచిలుకు పలుకుతుండగా.. వ్యాపారులు మాత్రం ఐదువందల పైచిలుకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. తేమ శాతం, నాణ్యత పేరుతో రూ.1000 నుంచి రూ.2 వేలు తగ్గించి కొంటున్నారు. ఇదేంటని ప్రశ్నించిన రైతులకు కనీసం సరైన సమాధానం చెప్పకుండానే వ్యాపారులు వెనుదిరుగుతున్నారు. గతేడాది కంటే ఈ ఏడు మార్కెట్‌లో మిర్చి ధరలు సగానికి సగం తగ్గిపోవడంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాత కొట్టుమిట్టాడుతున్నాడు. ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. వ్యాపారులు కొనుగోలు చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి పంటను క్వింటాకు రూ.25 వేల చొప్పున కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు.

## ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం
- ఖమ్మం జిల్లాలో 72 కేంద్రాలు.. 17,783 మంది విద్యార్థులు..
- ఎగ్జామ్ ప్రారంభమైన 5 నిమిషాల వరకు 'కేంద్రం'లోకి అనుమతి
- అర్ధగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలంటున్న అధికారులు


ఖమ్మంలో బెంచీలపై విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

ఖమ్మం అర్బన్, మార్చి 4: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సర పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 72 కేంద్రాల్లో అధికారులు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నా.. పరీక్ష కేంద్రంలోనికి అనుమతించనున్నారు. అయితే, విద్యార్థులు అర్ధగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. బుధవారం 17,783 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయనున్నారు. ఈ 72 కేంద్రాల్లోని సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అక్కడ పటిష్ట ఏర్పాట్లు చేశారు. అయితే, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకానున్నాయి.

### వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు..

హాల్‌టికెట్లను పొందేందుకు చిక్కులు లేకుండా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయాన్ని ఇంటర్ బోర్డు అధికారులు ఈ ఏడాది కల్పించారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌పై వివరాలు సరిపోతే నేరుగా పరీక్ష కేంద్రంలోకి వెళ్లి పరీక్షలు రాయొచ్చని అధికారులు స్పష్టం చేశారు. కాగా, ఇన్విజిలేటర్లు ఫోన్లు వినియోగించే అవకాశం లేకుండా నిబంధనలు అమలు చేస్తున్నారు. సీఎస్‌లు, డీవోలు పరీక్ష కేంద్రాల్లోని గదులన్నింటినీ నిశితంగా పరిశీలించాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

### స్క్వాడ్స్‌తో సమావేశం..

పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో కే.రవిబాబు.. ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా చర్యలు తీసుకోవడంలో స్క్వాడ్స్‌దే కీలకపాత్ర అని అన్నారు. తనిఖీలు నిరంతరం జరగాలని ఆదేశించారు.

### విద్యార్థులకు సూచనలు..

- విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే ఎగ్జామ్ సెంటర్‌కు చేరుకోవాలి.
- ఎక్కువ బ్రాంచీలున్న కార్పొరేట్ కళాశాలల్లో పరీక్ష కేంద్రం పడితే హాల్‌టికెట్‌లోని క్యూ ఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రాన్ని గుర్తించాలి.
- హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిళ్లు కచ్చితంగా వెంట తెచ్చుకోవాలి.
- పరీక్ష హాల్లోకి వెళ్లగానే ఓఎంఆర్ షీట్‌పై పొందుపర్చిన వివరాలు సక్రమంగా ఉన్నాయో లేవో సరిచూసుకోవాలి.
- ప్రశ్నపత్రం ఇవ్వగానే ఆందోళన చెందొద్దు. మొదటి ఐదు నిమిషాల పాటు ప్రశ్నపత్రాన్ని ప్రశాంతంగా చదవాలి. మొదటగా తెలిసిన ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వంటివి తీసుకెళ్ల కూడదు.
- పరీక్ష కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే 9948904023 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

### 'భద్రాద్రి'లో 19,258 మంది


మణుగూరు పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కొత్తగూడెం గణేశ్ టెంపుల్, మార్చి 4: బుధవారం నుంచి ప్రారంభమవుతున్న ఇంటర్ పరీక్షలను భద్రాద్రి జిల్లాలో 19,258 మంది విద్యార్థులు రాయనున్నారు. ఇందుకోసం అధికారులు 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిల్లో అన్ని సౌకర్యాలూ కల్పించారు. మొదటి సంవత్సర పరీక్షలకు 9,255 మంది, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 10,003 మంది హాజరుకానున్నారు. 36 మంది సూపరింటెండెంట్లు, 13 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. అలాగే, మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను, ఐదుగురు కస్టోడియన్ అధికారులను, 550 మంది ఇన్విజిలేటర్లను, ఇద్దరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. వైద్య సహాయం కోసం 72 మంది ఏఎన్‌ఎంలను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు.

## ముమ్మాటికీ ప్రభుత్వాల తప్పిదమే..

- ఎగుమతులకు చొరవ చూపకపోవడమే మిర్చి ధరల పతనానికి కారణం
- మిర్చి రైతుల వ్యథను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి
- తెలంగాణ రైతు సంఘం సదస్సులో వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు
- రైతుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మధు

రఘునాథపాలెం, మార్చి 4: మిర్చి ధరల పతనానికి ముమ్మాటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తప్పిదమే కారణమని వ్యవసాయ శాస్త్రవేత్త శరత్‌బాబు స్పష్టం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రధానమైన మిర్చి ఎగుమతులపై ప్రభుత్వాలు చొరవ చూపకపోవడంతోనే ఈ ఏడాది మిర్చి ధరలు భారీగా తగ్గాయని అన్నారు. అంతేగాక, నిరుడు పండించిన మిర్చి పంట పెద్ద మొత్తంలో నిల్వ ఉండడం, ప్రపంచ వ్యాప్తంగా మిర్చి దిగుమతి చేసుకునే దేశాల్లో పలు సంక్షోభాలు ఏర్పడడం వంటివి కూడా మరికొన్ని కారణాలుగా ఉన్నట్లు చెప్పారు. 'మిర్చి ధరల పతనం–పరిష్కార మార్గం' అనే అంశంపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జడ్పీ మీటింగ్ హాల్లో మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో శాస్త్రవేత్త శరత్‌బాబు ప్రధాన వక్తగా మాట్లాడారు. భారతదేశం దిగుమతి సుంకాన్ని పెంచిందనే కారణంతో కొన్ని దేశాలకు ఎగుమతులు నిలిచిపోయాయని అన్నారు. దీనికితోడు ఈ ఏడాది తామర పురుగు, చీడపీడల వల్ల మిర్చి దిగుబడి కూడా చాలా వరకూ తగ్గిందని అన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కోసం రైతాంగ ఉద్యమాలు అవసరమని అభిప్రాయపడ్డారు. రైతులే ఎగుమతి చేసుకుంటే దళారీ వ్యవస్థతో ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. మిర్చి ధర విషయంలో కేంద్ర మంత్రి క్వింటాకు రూ.11,781 మద్దతు ధర ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

### రైతుల కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం..

**-ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు**


ఐక్య పోరాటాలతోనే వ్యవసాయ రంగ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, రైతు సంఘాల నేతలు అభిప్రాయ పడ్డారు. సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ.. మిర్చి ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉందని గుర్తుచేశారు. కానీ ఈ ఏడాది మిర్చి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి క్వింటాకు రూ.25 వేల చొప్పున నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దొండపాటి రమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో వైరా మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి, రైతు సంఘాల నాయకులు బాగం హేమంతరావు, కొండపర్తి గోవిందరావు, నల్లమల వెంకటేశ్వరరావు, పోతినేని సుదర్శన్‌రావు, గుర్రం అచ్చయ్య, దండి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మి కూల్చుకుంటే.. నట్టేట ముంచారు..

పాత ఇంటిని కూల్చివేస్తే ముగ్గు పోస్తామన్నారు..
తీరా కూల్చాక జాబితాలో పేరు లేదంటున్నారు..

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో మళ్లీ బయటపడ్డ 'కాంగ్రెస్' మార్క్
- పైలట్ గ్రామాల్లోని పేదలకు ఇళ్లు మంజూరు చేసినట్లు పత్రాలు
- వాటిని నమ్మి ఇళ్లు కూల్చుకొని వెళ్తే పేర్లు లేవంటూ సమాధానాలు
- నెత్తీనోరూ బాదుకుంటూ దూరాభారాన అద్దె ఇళ్లలోకి లబ్ధిదారులు
- ఉన్న రేకుల ఇల్లూ లేక, కొత్త ఇల్లూ రాక నిరుపేదల ఆక్రందనలు
- పైలట్ గ్రామం 'ఆరెంపుల'లో రేవంత్‌రెడ్డి సర్కారు నయవంచన


కూల్చివేసిన ఇల్లు


లబ్ధిదారులకు అందజేసిన మంజూరు పత్రం

ఖమ్మం రూరల్, మార్చి 4: 'కొండనాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లు'గా ఉంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఆవేదన. వారిని అలా నయవంచనకు గురి చేసింది రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం. దీంతో 'నమ్మి కూల్చుకుంటే.. నట్టేట ముంచింది..' అంటూ లబోదిబోమంటున్నారు ఇళ్ల లబ్ధిదారులు. 'మీకు ఇల్లు మంజూరైంది. వీలైనంత తొందరగా పాత ఇంటిని కూల్చండి. మేము వచ్చి ముగ్గు పోస్తాం.' అంటూ అధికారులు హడావిడి చేశారు. ఇల్లు మంజూరైందనుకుంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తట్టాబుట్టా సర్దుకొని దూరాభారాన ఉన్న అద్దె ఇళ్లలోకి మారారు. వెంటనే వచ్చి తమ చిన్నపాటి గుడిసెలకు, పాత రేకుల ఇళ్లను కూల్చివేశారు. వారాలు, నెలలు గడిచినా అధికారులు రాలేదు. ముగ్గులు పోయలేదు. దీంతో కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగి ఎట్టకేలకు అధికారులను కలిశారు. 'మీరు చెప్పినట్లుగా ఇల్లు కూల్చాం సారూ.. మీరు వచ్చి ముగ్గు పోయడమే తరువాయి..' అంటూ చెప్పారు. 'మీ పేరు జాబితాలో లేదు.' అని ఒకరికి, తాజా జాబితాలో మీ పేరు రాలేదు. మొదటి జాబితా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాక మీ ఇంటికి ముగ్గు పోస్తాం.' అంటూ మరొకరికి, 'మీ పేరు మూడో జాబితాలో ఉంది. దాని నిర్మాణం ఇప్పట్లో కాదు..' అంటూ ఇంకొకరికి సమాధానాలు చెప్పారు అక్కడి అధికారులు. దీంతో ఎంతో ఆశతో వెళ్లిన లబ్ధిదారులకు ఆవేదనే మిగిలింది. దీంతో 'కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఉన్న ఇల్లు కూల్చుకుంటే.. చివరికి నట్టేట ముంచింది..' అని తలబాదుకుంటూ వెనుదిరిగారు.

'మా గ్రామం పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైందని ప్రకటించి, అధికారిక వేదికల మీద సాక్షాత్తూ ప్రజాప్రతినిధులతో ఇళ్ల మంజూరు పత్రాలు అందించిన ప్రభుత్వం మమ్ములను నయవంచనకు గురిచేసింది' అంటూ మండిపడుతున్నారు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు. పాత ఇళ్లు తొలగించుకుంటే ముగ్గుపోస్తామని, వెంటనే నిర్మాణం మొదలుపెడితే మొదటి విడత సాయాన్ని జమచేస్తామని హడావిడి చేసిన పాలకులు తమకు తీరని ద్రోహం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కారు ఇచ్చే ఇందిరమ్మ ఇంటిని కట్టుకుందామని, గృహ ప్రవేశం కాగానే పిల్లల పెళ్లిళ్లు చేద్దామని తాము కన్న కలలను కాంగ్రెస్ ప్రభుత్వం కల్లలు చేసిందని నెత్తీనోరూ బాదుకుంటున్నారు.

### పైలట్ గ్రామంలో లబ్ధిదారుల కుదింపు..

ఖమ్మం రూరల్ మండలంలోని పైలట్ గ్రామమైన ఆరెంపులలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నయవంచనకు గురిచేసింది. ఎన్నికల హామీ అయిన ఆరు గ్యారెంటీల్లోని నాలుగు పథకాల అమలు కోసం రేవంత్ ప్రభుత్వం.. ఆరెంపుల గ్రామాన్ని జనవరి 25న ప్రకటించింది. మరుసటి రోజైన 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసింది. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం అప్పటికే ఆ గ్రామంలో రెండు దఫాలుగా మొత్తం 950 దరఖాస్తులు స్వీకరించింది. వాటన్నింటినీ వడపోసి అర్హులను గుర్తించింది. అదే గ్రామసభలో లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి మంజూరు పత్రాలు కూడా అందజేసింది.

ఆ తరువాత అఖిలపక్ష నాయకులు, అధికారులు కలిసి ఉమ్మడి సమావేశం నిర్వహించారు. 157 మందితో కూడిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. కానీ.. ఆ తరువాత 43 మందిని తగ్గించి 114 మందితో తుది జాబితా ఖరారు చేశారు. అయినప్పటికీ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులందరికీ అధికారుల ద్వారా ప్రభుత్వం కబురు పంపింది. త్వరగా స్థలాలు సిద్ధం చేసుకుంటే ముగ్గులు పోస్తామని, నిర్మాణాన్ని ప్రారంభిస్తే మొదటి విడతగా రూ.లక్ష సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని హడావిడి చేసింది. దీంతో ప్రభుత్వ మాటలను నమ్మి ఇళ్లు కూల్చుకున్న లబ్ధిదారులకు ఆక్రందన మిగిల్చింది. మొదట గ్రామసభల సాక్షిగా మంజూరు పత్రాలు ఇచ్చినప్పటికీ.. తరువాత జాబితాల్లో పేర్లు లేవంటూ ద్రోహం తలపెట్టింది.

### కార్యదర్శికి బాధిత లబ్ధిదారుల వినతి

మంజూరు పత్రాలు అందించిన తమకు కొర్రీలు పెట్టకుండా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలంటూ బాధిత లబ్ధిదారులు వేడుకుటుంటున్నారు. ఈ మేరకు వారంతా కలిసి సోమవారం వెళ్లి పంచాయతీ కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాలతో నిరుపేదలమైన తమను వెనక్కు నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాటలు విని ఉన్న ఇళ్లను కూల్చుకున్న తమను న్యాయం చేయాలని వేడుకున్నారు.


### ఇల్లు కూలగొట్టుకున్నాక పేరు లేదంటున్నారు..



'మీకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. మీరు ఎంత తొందరగా పాత ఇంటిని తీసేస్తే మేం అంత తొందరగా వచ్చి ముగ్గు పోస్తాం' అంటూ అధికారులు చెప్పారు. దీంతో నేను, నా భర్త కలిసి మా పాత రేకుల ఇంటిని కూల్చివేశాం. వారం పదిరోజులు గడిచినా అధికారులు రాలేదు. ముగ్గు పోయలేదు. కార్యాలయానికి వెళ్లి అడిగితే.. 'మీ పేరు మొదటి జాబితాలో లేదు. మొదటి జాబితా వాళ్ల నిర్మాణాలు పూర్తయ్యాక మీ పేరు వస్తుంది' అని చెప్పారు. స్వయంగా అధికారులు చెబితేనే ఇల్లు కూల్చుకున్నాం. సామాన్లు తీసుకెళ్లి అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

**–కొప్పుల రాజేశ్వరి, లబ్ధిదారురాలు, ఆరెంపుల**

### వేదిక మీదకు పిలిచి మంజూరు పత్రం ఇచ్చారు..



జెండావందనం రోజున అధికారులు మా ఊళ్లో మీటింగ్ పెట్టారు. ఇందిరమ్మ ఇళ్లు వచ్చిన వాళ్లకు ఆ మీటింగ్ వేదిక మీద మంజూరు పత్రాలు అందజేశారు. నన్ను కూడా స్వయంగా స్టేజీ మీదకు పిలిచి మరీ మంజూరుపత్రం ఇచ్చారు. అప్పుడు చాలా సంతోషపడ్డా. ఇందిరమ్మ ఇంటిని కట్టుకోబోతున్నామని కలలుగన్నాం. అధికారులు చెప్పగానే అప్పటికప్పుడు మా పాత ఇంటిని కూల్చివేశాం. తొందరగా కట్టుకుంటే పిల్లల పెళ్లిళ్లు కూడా చేయొచ్చని ఆశపడ్డాం. కిరాయి ఇంట్లోకి వెళ్లాం. ఇప్పుడేమో అధికారులు మా పేరు మూడో జాబితాలో ఉందని అంటున్నారు. అది కూడా ఇప్పట్లో రాదని చెబుతున్నారు.

**–చిర్రా రాజ్యం, లబ్ధిదారురాలు, ఆరెంపుల**

## కొనుగోళ్లలో రైతులను మోసగిస్తే కఠిన చర్యలు

- ఖమ్మం మిర్చి యార్డు ఆకస్మిక తనిఖీలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్


కలెక్టర్‌కు మిర్చి పంటను చూపిస్తున్న రైతులు

రఘునాథపాలెం, మార్చి 4: నాణ్యమైన మిర్చిని ధర తగ్గించి కొనుగోలు చేస్తే ఉపేక్షించేది లేదని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ వ్యాపారులను హెచ్చరించారు. ఖమ్మం ఏఎంసీకి మిర్చి పంటను తీసుకొచ్చే రైతులకు గిట్టుబాటు ధర దక్కడం లేదనే ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఆయన మిర్చియార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లను పరిశీలించారు. గిట్టుబాటు ధరకే మిర్చి కొనుగోలు చేయాలని వ్యాపారులకు సూచించారు. మిరపకాయలను పట్టుకుని తేమ శాతాన్ని, నాణ్యతను పరిశీలించారు. పంట నాణ్యంగానే ఉన్నప్పటికీ తక్కువ ధర ఎందుకు చెల్లిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ ఎదుట రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. జెండాపాటకు రూ.వేలల్లో వ్యత్యాసం చూపిస్తూ వ్యాపారులు తమ పంటను కొనుగోలు చేస్తున్నారని, దీంతో తమకు తీవ్రంగా నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ.. ధరల విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు గిట్టుబాటు ధరకు పంటలను విక్రయించుకునే వరకూ నిరంతర పర్యవేక్షణ చేపడుతానని అన్నారు. డీఎంవో అలీమ్, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అపర భగీరథుడు కేసీఆర్

- ఆయనకు ఆజన్మాంతం రుణపడి ఉంటాం: అన్నపురెడ్డిపల్లి రైతులు
- పాలు, గోదావరి జలాలతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి ఫ్లెక్సీకి అభిషేకం


కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

అన్నపురెడ్డిపల్లి, మార్చి 4: 'అపర భగీరథుడు.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్' అని అన్నపురెడ్డిపల్లి మండల రైతులు పేర్కొన్నారు. వర్షాధారంపైనే పంటలు సాగుచేసుకునే తమకు.. గోదావరి జలాలను అందించి తమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన జలబాంధవుడికి తాము ఆజన్మాంతం రుణపడి ఉంటామంటూ పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నీళ్లు తమ పంట పొలాలకు చేరడం పట్ల భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డిపల్లి మండల రైతులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఉన్న ములకలపల్లి మండలం కమలాపురం పంపుహౌస్–3 నుంచి సోమవారం రాత్రి అధికారులు తొలిసారిగా సాగునీటిని విడుదల చేశారు. ఆ నీళ్లు సీతారామ కాలువ ద్వారా మంగళవారం అన్నపురెడ్డిపల్లి మండలానికి చేరుకున్నాయి. అయితే, తమ పంట పొలాల్లోకి చేరిన గోదావరి జలాలను తాకి ఆయా గ్రామాల రైతులు మురిసిపోయారు. తమలాంటి రైతుల కోసం కేసీఆర్ తీసుకున్న సంకల్పం ఫలించిందని, ఆయన అందించిన గోదావరి జలాలలో తమ పొలాల్లో పసిడి పంటలు పండుతాయని ఆనందం వ్యక్తం చేశారు. నర్సాపురం రెవెన్యూలోని పలువురు రైతులు కాలువలోని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడే కేసీఆర్ ఫ్లెక్సీకి పాలు, గోదావరి జలాలతో అభిషేకం చేశారు.